
# వాగ్దానం

- తాటికోల, పద్మావతి



సాయంత్రం ఆరు గంటల వేళ సంధ్య చీకట్లు ముసురుకొంటున్నాయి. ఆ రోజు శనివారం కావటంతో దగ్గరలో వున్న వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్లింది అరుంధతి. భర్త విశ్వనాథం టీవీ చూస్తూ ఇంట్లోనే కూర్చున్నారు. ఆయనకి పెద్దగా గుడి, గోపురాలంటే ఇష్టం లేదు. దైవాన్ని మనసులోనే స్మరిస్తాడు. అంతకుమించి మరొకటి చేయరు. అరుంధతి గుడిలో కొబ్బరికాయ కొట్టి దైవదర్శనం చేసుకుని ఇంటికి వచ్చింది. కొబ్బరి ముక్క ప్రసాదం భర్త చేతికి అందించింది. కాదనకుండా తీసుకుని నోట్లో వేసుకున్నారు.

ఉదయం స్నేహితురాలి పెళ్లికని వెళ్లిన కూతురు లావణ్య ఇంకా ఇంటికి రాలేదని ఆందోళనగా ఎదురు చూస్తున్నారు. ఒక్కదాన్నే పంపటం వలన కాస్తంత మనసు అశాంతిగా ఉంది. రోజులు బాగాలేవు.

వంటగదిలోకి అడుగుపెడుతున్న అరుంధతి, 'అమ్మా!' అన్న పిలుపుతో అప్రయత్నంగా వెనక్కి తిరిగింది. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసేసరికి ఒళ్లు ఝల్లుమన్నది. చేతులు, కాళ్లు చల్లబడుతున్నాయి. నోటమాట రాలేదు. అప్రతిభురాలై చూస్తున్నది.

లావణ్య, ప్రక్కనే మరో కుర్రాడు. ఎర్రగా, పొడుగ్గా అందంగా ఉన్నాడు. ఇద్దరి మెడలోనూ పూలదండలు బరువుగా వేలాడుతున్నాయి. పసుపుతాడుకి మధ్యలో మంగళసూత్రాలు ధగధగ మెరుస్తున్నాయి.

మమ్మల్ని ఆశీర్వదించమంటూ తల్లి కాళ్లకు నమస్కరించబోయింది. రెండడుగులు వెనక్కు వేసింది అరుంధతి. ఇద్దరూ కలిసి తండ్రి దగ్గరకొచ్చారు. విశ్వనాథంకి అంతా అయోమయంగా అనిపిస్తున్నది.

నిర్ఘాంతపోయి చూస్తున్న తండ్రి దగ్గర నిలబడింది లావణ్య. నాన్నా! మేమిద్దరం ప్రేమించి పెళ్లిచేసుకున్నాం. ఇతను పి.జి. పూర్తిచేసి ప్రస్తుతం ఒక ప్రైవేటు ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. గవర్నమెంటు ఉద్యోగం కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నాడు. తప్పకుండా వస్తుందని

అనుకుంటున్నాం. తలవంచుకుని మెడలో పూదండ సవరించుకుంటూ చెప్పింది లావణ్య.

అరుంధతికి కూతురిని చూడగానే అరికాలి మంట నెత్తికెక్కింది. వాళ్లిద్దరినీ కనీసం కూర్చోమని కూడా చెప్పలేదు.

'స్నేహితురాలి పెళ్లికని చెప్పింది ఇందుకోసమేనా. నా అనే వాళ్లు లేరనుకున్నావా. ఇన్నేళ్లు పెంచి పెద్ద చేశాం. తల్లీదండ్రీ చచ్చిపోయారనుకున్నావా. మాకు చెప్పకుండా పెళ్లి చేసుకోవటానికి నీకు మనసెలా ఒప్పింది. మేం నీకేం తక్కువ చేశామని ఇంతకు తెగించావు. ఇన్ని వేలు ఖర్చుపెట్టి డిగ్రీ చెప్పిస్తున్నాం. ఈ సంవత్సరంతో ఫైనల్ ఎగ్జామ్స్ పూర్తి కాగానే సలక్షణమైన మంచి సంబంధం చూసి పెళ్లి చేయాలనుకొంటున్నాం. మా ఆశలన్నీ నేలపాలు చేశావు కదే. పట్టుమని ఇరవై ఏళ్లు కూడా రాకుండానే పెళ్లికి తొందరపడతావా' అంటూ భద్రకాళిలా లేచింది అరుంధతి.

విశ్వనాథం అంతకంటే విరుచుకుపడ్డారు.

'కన్న తల్లిదండ్రుల్నే మోసం చేశావు. ఇప్పటివరకూ నీమీదున్న ప్రేమాభిమానాలకు నీళ్లు వదులుకున్నాను. నీకూ, మాకూ ఋణం తీరిపోయినట్లే.'

'అరుంధతీ! వాళ్లను బయటికి పంపించి తలుపులు వేయమ'ని చెప్పి గదిలోకెళ్లి మంచం మీద వాలి కళ్లు మూసుకున్నారు.

తల్లిదండ్రుల ఆశీర్వాదం కోసం వచ్చిన ఇద్దరికీ ఆదరణ లభించకపోగా అవమానం జరిగింది. వెంటనే ఇద్దరూ కలసి ఆటోలో ప్రకాష్ రూంకి చేరుకున్నారు.

కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నది అరుంధతి.

'ఇది నా కూతురేనా. నా చేతుల్లో పెరిగిన పిల్లేనా. ఎంత గారాబంగా పెంచాం. అడిగినవన్నీ కొని అపురూపంగా చూసుకున్నందుకు తగిన శాస్తి జరిగింది. పందొమ్మిదేళ్ల తన చుట్టూ కలసిమెలసి తిరిగిన పిల్ల ఎవరో ముక్కూ మొహం తెలియని వాడ్ని ప్రేమించాననంటూ, ఎవరికీ తెలీకుండా మూడుముళ్లూ వేయించుకుని వచ్చి, ఇతను మీ అల్లుడు అంటే అంగీకరించటానికి మనసు రావటం లేదు. అమ్మ తోడు ఎంతవరకో, అంతవరకే చూసుకుంది. ఇపుడు కావాల్సింది ప్రేమించిన భర్త తోడు కావాలి. ఈ వయసు అలాంటిది.'

జరిగినదాన్ని తలచుకుని బాధపడుతూ ఆ రాత్రికి ఎవరూ భోజనాలు చేయలేదు. వండిన గిన్నెలన్నీ అలానే ఉన్నాయి. ఆవేదనతో మనసు నలిగిపోయి అలసిపోయి ఉన్నారు.

'లావణ్య ఇలా ఎందుకు చేసిందో అర్థం కావటం లేద'న్నారు విశ్వనాథం.

భారమైన మనసు గుండెల్ని పిండి చేస్తున్నది.

'ఎక్కడో ఏదో లోపం ఉందండీ. మన పెంపకంలో మనకి తెలియకుండానే లోపం ఉండి ఉండవచ్చు. నాకు తెలిసినంత వరకూ ఏ లోటూ చేయలేదు. కష్టం తెలీకుండా పెంచాం. ఆ అబ్బాయిది ఏ కులమో, ఏమో? సరిగా చూసుకుంటాడని నమ్మకమేముంటుంది. పెద్దవాళ్లకు తెలీకుండా చేసుకున్న పెళ్లిళ్లు ఎన్ని ఫెయిలవుతున్నాయో చూస్తున్నాం కదా! కొత్త మోజు తీరగానే ముఖం చాటేసి, చెప్పాపెట్టకుండా ఆ అబ్బాయి దారి ఆ అబ్బాయి చూసుకున్నాడంటే మన పిల్ల గతేంకావాల'ంటూ భోరుమంది అరుంధతి. ఆ తలపులకే చిగురుటాకులా కంపించిపోయింది శరీరం.

'ఓసి పిచ్చిదానా! ఇంకా ఎందుకీ మమకారాలు. మనల్ని కాదని వెళ్లిపోయాక మనమేం చెయ్యలేం. ఈ వయసు అలాంటిది. మనం ఎన్ని చెప్పినా వాళ్ల తలకెక్కవు. ప్రేమ మైకంలో పడిపోయిన వారిని ఆపలేం. దాని తలరాత ఎలా రాసిపెట్టి వుంటే అలాగే జరుగుతుంది. మనం నిమిత్తమాత్రులం' అన్నారు విశ్వనాథం.

కూతురు చేసిన తప్పు సమాజానికి తెలిస్తే నలుగురిలోనూ చులకన కాక తప్పదు. ఆడపిల్లని అదుపులో ఉంచలేదు. అందుకే ఇలా చేసిందని నలుగురూ నానా రకాలుగా చెవులు కొరుక్కుం టారు. తప్పు చేయటం తేలికే. ఆ తప్పుని నలుగు రూ వేలెత్తి చూపితే తట్టుకోవటం చాలా కష్టం.

రిటైరైనాక ఇంట్లోనే ఉంటున్నారు విశ్వనాథం. ఎప్పుడైనా సాయంత్రం పూట అలా బయటికి వెళ్తుండేవారు. ఇప్పుడదీ వెళ్లటం మానేశారు.

కూతురి విషయం తెలిసినవాళ్లు ఎవరైనా అడిగితే ఏమని సమాధానం చెబుతాడు. అలాగని ఎన్నాళ్లు ఇంట్లో కూర్చుంటాడు. వీధి ముఖం చూడాలంటేనే భయంగా ఉంది. భార్య అరుంధతి సంగతి చెప్పనవసరం లేదు. జీవితం మీద విరక్తి భావం లాంటిది కలిగింది. ఇంట్లో పని ఉన్నంత వరకు చేసుకోవటం, లేకపోతే కళ్లు మూసుకుని పడుకోవటం. ఇంట్లో అన్నీ వున్నా మనశ్శాంతి కరువైంది. బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నిరాశా నిస్పృహలతో రోజులు గడిచిపోతున్నాయి.

అప్పుడప్పుడు కూతురు గుర్తుకొచ్చినప్పుడల్లా హృదయం కలచివేస్తున్నది. కొత్తచోట ఎలా వుందో ఏమో, తింటున్నదో లేదో. తల్లిదండ్రుల్ని మరచిపోయి ఎలా ఉండగలుగుతున్నది. ఆపదలో ఆదుకోవటానికి అండదండగా ఎవరో ఒకరు తోడుండి తీరాలి. అటు చూస్తే వాళ్ల వాళ్లు చేరదీసినట్లు లేరు. ఇంట్లో పెద్దవాళ్లని ఎదిరించి తనకిష్టమైన అమ్మాయిని చేసుకొని వస్తే తల్లిదండ్రులు తొందరగా స్వీకరించలేరు. జ్ఞాపకాలు పురుగుల్లా తొలిచివేస్తున్నాయి. కాస్త బయటికి వెళితే మనసు ప్రశాంతంగా ఉండవచ్చునుకుని సాయంత్రం కాగానే అలా గోదావరి గట్టుదాకా వెళ్లివస్తానని బయలుదేరారు విశ్వనాథంగారు.

బ్రిడ్జి మీద నుంచి రైలు వెళ్తున్నది. పార్కులో జనం కూర్చుని ఉన్నారు. బఠాణీలు, వేరుశెనక్కాయలు, మసాలాలు ఎవరికి కావలసినవి వాళ్లు కొనుక్కుని తింటున్నారు. రకరకాల మనస్తత్వాల వాళ్లు మాట్లాడుకుంటున్నారు. వంటరిగా కూర్చున్న విశ్వనాథం దూరంగా కనిపించే నీళ్లను, నీళ్లలోని పడవల్ని చూస్తూ కూర్చున్నారు. కాస్తంత దూరంలో కనిపించిన వ్యక్తిని చూసి తుళ్లిపడ్డాడు. అతను రామ్మూర్తి. తన ప్రాణ స్నేహితుడు. పలకరించడానికి అభిమానం అడ్డు వస్తున్నది. ఇవాల్టితో తన పరువు కాస్తా పోయినట్లే. ఏ ముఖంతో ఎదురుపడగలడు. అదిగో ఇటే చూస్తున్నాడు. మధ్యమధ్యలో చూసీ చూడనట్లు తలతిప్పుకుంటున్నాడు. సందేహం లేదు రామ్మూర్తే. చూసి కూడా పలుకరించకపోయానంటే జన్మలో తన ముఖం చూడడు. నేనేదో బాధలో ఉన్నాను. తనే స్వయంగా వచ్చి పలకరించవచ్చు కదా. ఎందుకలా ముఖం చాటేస్తున్నాడు. మనిషి నీరసంగా, దిగులుగా కనిపిస్తున్నాడు. అసలు రామ్మూర్తికి ఈ ఊర్లో ఏం పని. అయిదారు నెలల నుంచి ఇద్దరికీ ఫోన్లలో మాట్లాడుకోవటం లేదు. ఉత్తరాలు అసలే లేవు.

కూర్చున్నచోటు నుంచి లేచి నాలుగడుగులు ముందుకేశాడు విశ్వనాథం. పరధ్యానంగా ఉన్న రామ్మూర్తి విశ్వనాథం భుజం తట్టగానే తల తిప్పి చూశాడు. ఆ కళ్లల్లో దీనత్వం, ఆ చూపులు

## కట్టె బతుకు

ఇవి సేతులు కావు బాబూ!
మొద్దుబారిన బానిస బతుకు ఆనవాళ్ళు
పెద్ద పెద్ద మానుల్ని
మట్టి కరిపించిన సురకత్తులు!
సూరీడితో పోటీపడి ఉదయించి
సందేలకు నిలువెత్తు కట్టెల పోగయినప్పుడు
నా కండలకి మా యమ్మ దిష్టి తీసేది!
బువ్వ ముట్టనీక బగ్గుమనే అరిసేతులు నేరిసిన
పనికి మీసాలెగదోశాయి
నాయనిచ్చిన విద్దె
అమ్మ ఇచ్చిన కండలు
ఈ పట్నం మెల్లొచ్చికొడి గట్కబోతన్నయి
కండలు కరిగిపోయిన నేను
ఈడ కొండలెక్కి కట్టెలిరగ దీతునా?
నా కట్టెల్ని ఈ పట్నం పోల్లేం జేతురు దొరా
శవాలని సివరి దాకా సాగనంపేటందుకే గదా!
నేనే కట్టెగా మిగిలినంక దొరా
ఇంక
గొడ్డలి కూడా బరువేగదా!

–డా. చిల్లర భవానీదేవి

విషాదంగా ఉన్నాయి.

మెల్లగా భుజం మీద చేతిని తీసి పట్టుకుని, 'నాకు తెలుసు, నువ్వు వస్తావని' అన్నాడు.

'అయితే, నన్ను గుర్తుపట్టి కూడా చూడనట్లున్నావా' అన్నాడు విశ్వనాథం.

'నిన్ను చూసి పలకరిస్తే ఒక నిజం చెప్పాల్సి వస్తుంది. అది విని నువ్వు తట్టుకోలేవని తెలుసు. చెప్పకుండా దానినందువల్ల ప్రయోజనం లేదు. ఎప్పటికైనా తెలియాల్సిందే. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది' బాధగా గుండెమీద చేయి వేసుకున్నాడు రామ్మూర్తి.

విశ్వనాథం ఒక్క నిమిషం అయోమయంలో పడ్డాడు. రామ్మూర్తి చెప్పాలనుకున్నదేమిటి? ఇద్దరం ప్రాణస్నేహితులం. ఒకరి కష్టసుఖాలు ఒకరం చెప్పుకొంటాం. నాలుగేళ్ల క్రితం ఇద్దరూ ఒక వాగ్దానం చేసుకున్నారు. రెండేళ్ల తరువాత అమలుపరచాలనుకున్నారు. వచ్చే సంవత్సరం అనుకున్నది చేస్తామని ఇద్దరి మనసులోనూ దృఢనిశ్చయమైంది. ఈలోగా సంభవించిన పరిణామం ప్రమాదాల హెచ్చరిక అని తెలుసుకోలేకపోవటం వాళ్లు చేసిన పెద్ద తప్పు.

తన కూతురి విషయం రామ్మూర్తికి తెలిసే ఉంటుంది. అందుకే ఇలా మాట్లాడుతున్నాడు. అయిపోయింది, అంతా అయిపోయింది. ఇవాల్టితో పరువు-ప్రతిష్ఠ మంటగలిసిపోయాయి. ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులకు అవమానం మిగలక తప్పదనుకున్నాడు.

'నీకిచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయాన'న్నాడు రామ్మూర్తి.

'ఎన్నో వాగ్దానాలు చేసుకుంటాం, ఎన్నో అనుకుంటాం. అనుకున్నవన్నీ నెరవేరాలనుకోవటం మన తప్పు. పిల్లల మనస్తత్వాలు తెలుసుకోలేకుండా మాటివ్వటం పొరపాటు. అడ్డాలనాడు బిడ్డలు కాని, గెడ్డాలొచ్చాక బిడ్డలు కాదు. ఇలా చేస్తాడని కలలో కూడా అనుకోలేదు.'

రామ్మూర్తి చెబుతున్నాడు. విశ్వనాథం వింటున్నాడు.

'నీ కూతుర్ని నా కొడుక్కి చేసుకుంటానన్నాడు. కట్నకానుకలు వద్దనుకున్నాం. మన స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకోవాలని ఆశపడ్డాం. మంచి రోజు చూసి పెళ్లికి ముహూర్తాలు పెట్టిద్దామనుకున్నాను. ఎవరికీ చెప్పాపెట్టకుండా ఎవరో ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుని వచ్చాడు. ఒక ఆడపిల్లకు అన్యాయం చేసిన ఉసురు నాకు తప్పకుండా తగులుతుంది. నీ కూతురికి మరో మంచి సంబంధం చేయి. ఆ పిల్లయినా సుఖపడాలని కోరుకుంటున్నాను.'

'కొడుకు చేసిన తప్పుకి నేను క్షమాపణ వేడుకొంటున్నాన'న్నాడు రామ్మూర్తి.

విశ్వనాథంకి గాభరా తగ్గి మనసు కాస్త కుదుటపడింది. తనతోపాటే పడవలో ప్రయాణం చేస్తున్నాడు. రోలు వెళ్లి మద్దెలతో మొరపెట్టుకున్నట్లుంది.

'నేను కూడా అదే పరిస్థితిలో ఉన్నాను. నన్ను కూడా నువ్వు క్షమించాల'న్నాడు విశ్వనాథం.

'మగాడు నీ కొడుకుని అని ఏం ప్రయోజనం. ఆడపిల్ల నా కూతురు నన్ను తలవంచుకునేలా చేసింది. ప్రేమించిన వాడ్ని పెళ్లి చేసుకుని ఇంటికి వచ్చింది. నువ్వు, నేను అనుకున్న వాగ్దానాలు గాలిలో కలిసిపోయాయి. నీ కొడుకుతో పెళ్లి జరిపించాలని, కష్టపడకుండా సుఖపడాలని కోరుకున్నాను. నా గుండెల మీద గాయం చేసి వెళ్లిపోయింది. ఇద్దరి సమస్య ఇలా పరిష్కారమవుతుందనుకోలేదు. పిల్లలు పెద్దవాళ్లయ్యాక మనం చెప్పినట్లు నడుచుకుంటారనుకోవటం మన భ్రమ. ఇద్దరం మరచిపోదాం. ఇదివరకులాగా స్నేహితుల్లాగానే మిగిలిపోదాం. పిల్లల్ని కనటం గాని, వాళ్ల తలరాతల్ని కనలేం గదా. ఈ విషయం నీకెలా చెప్పాలా అని మనసులో కుమిలిపోతున్నాను. ప్రేమ మోజులో పడి పెద్దవాళ్లను మరచిపోతున్న రోజులివి. వాళ్లు మనల్ని దూరం చేసుకుని వెళ్లిపోతారు.' విశ్వనాథం మనసులోని ఆవేదన అర్థమైంది రామ్మూర్తికి.

'మన స్నేహాన్ని గౌరవంగా కాపాడుకోగలిగాం. స్నేహానికి అర్థం ఏమిటో తెలిస్తే, వాళ్లలా చేసి వుండేవాళ్లు కాదు. మనం బాధపడి ప్రయోజనం ఏముంది' అన్నాడు రామ్మూర్తి.

అంతకంటే ఏం చేయగలమంటూ దీనంగా దూరంగా పారే గోదావరిని చూస్తూ ఉండిపోయారిద్దరూ. ☐